కథ

# మానవ సంబంధాలు

**బి. సూర్యప్రకాశ్**

నేను ఆర్ట్స్ కాలేజీలో సైకాలజీ బోధించే అధ్యాపకురాలిని. తీరిక వేళల్లో వ్యక్తిత్వ వికాస పుస్తకాలు చదవడమంటే నాకు చాలా ఇష్టం. కాలేజీలో విద్యార్థుల మనస్తత్వం విశ్లేషించడం, అప్పుడప్పుడు పత్రికలకు మానవ సంబంధాలపై రచనలు చేయడం నా హాబీ. మానవ సంబంధాలపై పిహెచ్‌డి చేయాలన్నది నా ఆశయం కూడా. ఆదివారం తీరిక దొరగ్గానే పర్సనల్ లైబ్రరీలోంచి ఓ పుస్తకం తీశాను.

★★★

'కురిసిన ప్రతి చినుకు ముత్యం అవుతుంది
ఎండిన ఆకు కూడా ఆనందం అవుతుంది
బ్రతుకు స్పర్శలో జీవితపు మందహాసంలో
దుఃఖం కూడా ఆనందం అవుతుంది
క్షణ క్షణం నన్నిలా అమృతం తాగిస్తోంది
గుక్క గుక్కకి హృదయం సంతోషంతో నిండుతుంది
నిశ్శబ్దపు అర్ధరాత్రిలో, కనురెప్పలపై వాలె నిద్ర కూడా
భవిష్యత్తుని తన స్నేహితురాలికి తీసుకొస్తూ
నన్ను సంతృప్తితో నింపుతుంది'

సంపూర్ణ విజయమంటే అది! ఎంత గొప్ప నీతి. అనుకుంటూ పుస్తకం మూసి ఇంతలో కాలింగ్‌బెల్ వినిపిస్తే తలుపు తెరిచాను. అత్తగారు నీరసంతో సోఫాపై వాలి ''సుధా! కాస్త కాఫీ చేసి పెట్టవే'' అంది.

వంట గదిలోకి పరుగెత్తి కాఫీ తెచ్చిచ్చాను. అత్తగారి ముఖం వెయ్యి కాంతుల బల్బులతో వెలుగుతోంది. ఏదో ప్రశాంతత ఆమె ముఖంలో ప్రతిబింబిస్తోంది. బహుశా బాబాగారి ఆశ్రమానికి వెళ్లొచ్చారనుకుంటా. ఎప్పుడూ నన్ను కూడా తనతో రమ్మని చెబుతుంది. నాకెందుకో చిన్నప్పటినుంచి బాబాలన్నా, నీతులు చెప్పేవాళ్లన్నా నచ్చదు. ఎందుకంటే నేను పెరిగిన వాతావరణంలో, తమపై నమ్మకం లేకుండా, అత్యాశలతో, నెరవేరని కోర్కెలతో బాబాలను ఆశ్రయించి డబ్బు, సమయం వృథా చేసుకున్నవారెందరో! అంతెందుకు! మా మేనత్తే ఉంది, కొత్తలో దైవంకన్నా మిన్నగా ఆరాధించేది భర్తని. అప్పుడప్పుడు ప్రేమ ఎక్కువై కాళ్లు కడిగి నీళ్లు తనపై పోసుకునేది. ఎప్పుడైతే భర్త వ్యాపారంలో నష్టపోయాడో క్రమక్రమంగా మామయ్యపై ప్రేమ తక్కువైంది. అనునిత్యం రాచిరంపాన పెట్టి తన ఆడంబరాలను తీర్చలేడని తెలిసి చెప్పాపెట్టకుండా ఇంటికి వచ్చేసింది. నాన్నగారికి చెల్లెలంటే వల్లమాలిన ప్రేమ. చెల్లెలి మాటలు విని బావను ఒక అసమర్థునిగా భావించి ఇంట్లోనే వుండమన్నాడు. వాస్తవంగా మామయ్య చాలా మంచివాడు. పైగా తెలివైనవాడు. పరిస్థితులు అనుకూలించక పెట్టిన డబ్బంతా వ్యాపారంలో నష్టపోయి దానితోపాటు భాగస్వాముల వెన్నుపోటుతో దెబ్బతిన్నాడు. కమలత్తయ్య అతనికి కష్టాల్లో వెన్నుగా నిలిచేదిపోయి ప్రతిరోజు డబ్బుకోసం హింసించేది. సంస్కారవంతుడు కాబట్టి ఏనాడూ చేయి చేసుకోలేదు. ఇలాంటివి తలచుకుంటే నాకనిపిస్తుంది. మనుషులు మానవ సంబంధాలకు విలువనివ్వకుండా కాషాయ దుస్తులు వేసుకునే బాబాలకు పాదాక్రాంతులవుతారు. కొద్దిక్షణాలు



వారు చెప్పే ఆధ్యాత్మిక ప్రసంగాలకు మైమరచి ప్రపంచంలో లేని ఆనందాన్ని పొందుతున్నట్లు భావిస్తారు. ఆ తరువాత మాయ తమను ఆవరించి భవబంధాలను గుర్తు చేస్తుందనే అందమైన ఆత్మవంచనతో తమను తాము సమర్థించుకుంటారు. జీవితంలో ఆచరించనివి ఊహించుకుంటూ ఆచరించేవీ, అవసరమైనవీ మరచిపోతూ జీవితాన్ని వ్యర్థం చేసుకుంటారు. కమలత్తయ్యలాంటిదే మావారి తల్లి. కాకపోతే ఆమె చదువుకోలేదు. ఈమె చదువుకుంది. పైగా వృత్తిరీత్యా డాక్టర్. నా ఉద్దేశ్యంలో ఈవిడ ఒక పచ్చి అవకాశాది, మెటీరియలిస్ట్. తనను తాను చాలా తెలివిగా సమర్థించుకుంటుంది. అర్థంలేని ఆదర్శాలు వల్లెవేస్తూ తను ఆచరించలేని సిద్ధాంతాలను ఇతరులకు చెబుతూ సంతృప్తి పడుతుంది. విద్యాధికురాలై కూడా కాపురానికి వచ్చిన కొత్తల్లో నన్నెంతో సాధించింది. మా నాన్నగారు కట్నం ఇస్తానన్నా తీసుకోలేదు. నన్ను ఉదయాన్నే లేవమనేది. బ్రహ్మకాలంలో లేస్తే ఎంతో తేజస్సు ముఖంలో ప్రతిబింబిస్తుందని చెప్పేది. పరిశీలిస్తే ఇందులో నిజమున్నా తను మాత్రం ఆచరణలో పెట్టేదికాదు. తన కూతుర్ని 8 గంటలకి లేపి బెడ్‌కాఫీ ఇచ్చేది. అప్పుడనిపించేది నాకొక నీతి తన కూతురుకొక నీతని. ఎప్పుడైనా అడగాలనిపించేది. కానీ మానవ సంబంధాలు చాలా సున్నితమైనవి కాబట్టి ఆగిపోయేదాన్ని. వాస్తవంగా వాణి చాలా అమాయకురాలు. జీవితమంటే బాయ్‌ఫ్రెండ్స్, విలాసవంతమైన కార్లు, డబ్బున్నవాళ్లతో స్నేహం అని భావిస్తుంది. ఈవిధమైన దృక్పథం అలవరచుకోవడానికి వాణిది కాదు తప్పంతా మా అత్తగారిదే. ఎందుకంటే చిన్నప్పటినుంచి ఆవిధమైన వాతావరణంలో పెంచింది. మా అత్తగారికి వాణిని 8 గంటలకు నిద్రనుంచి లేపినప్పుడు ఆధ్యాత్మికత, ఆదర్శాలు, నీతులు గుర్తుకు రావు. ఎందుకంటే కూతురుపై మమకారం తనను డామినేట్ చేస్తుంది కాబట్టి. నా విషయంలో గుర్తొస్తాయి. తనలో నిగూఢంగా దాగి వున్న స్వార్థం, ద్వంద ప్రవృత్తి, పైగా కోడలన్న భావం. అలా ఆలోచిస్తూ సోఫాలో జారుకున్నాను. నిద్రలోంచి లేచేసరికి నాలుగవుతోంది. ఇంతలో ఎవరో తలుపు తట్టిన శబ్దం. చూస్తే పనిమనిషి. మా పనిమనిషి మా అత్తగార్ని ఒక దైవంగా భావిస్తుంది. నేను బాత్రూమ్‌కి వెళ్లి మొహం కడుక్కుని పనిమనిషికి అంట్లు చూపించాను. మళ్లీ సోఫాలో కూర్చుని పుస్తకంలో నిమగ్నమయ్యాను. అత్తగారి మాటలు వినిపిస్తున్నాయి. పనిమనిషితో ఆవేశంగా స్త్రీవాదం గురించి, పనిమనిషి భర్త తాగుబోతుతనాన్ని నిందిస్తూ తను చేయబోయే సంఘసేవ గురించి, తన ఆధ్యాత్మిక జీవితం గురించి చిన్నసైజు లెక్చర్ ఇస్తోంది. అప్పుడు నాకర్థమయింది పనిమనిషితో అత్తయ్య ఎందుకంత ప్రేమగా వుంటుందో. కాలనీలో తన గురించి పదిమందికీ మంచి చెబుతుందన్న భావంతో. ఇది అత్తయ్యలో నిగూఢంగా వున్న ఐడెంటిటీ క్రైసెస్‌ని చూపిస్తుంది. పదిమందికీ తన గురించి పనిమనిషి మంచి చెబితే అది తన ప్రొఫెషన్‌కు లాభం కూడా.

ఇలాంటివారు సమాజంలో కోకొల్లలు. వీరు ఆచరించేది ఒకటి వల్లించేది మరొకటి. వీరు బాబాల ప్రసంగాల ద్వారా నేర్చుకునేది, అందమైన ఆత్మవంచన , పరిణతిలేని జీవితం. ఇలాంటివారు ఎప్పటికీ సంపూర్ణ విజయం సాధించలేరు. పచ్చి అవకాశవాదులు. స్వతహాగా స్వార్థపరులు. వీరు పెరిగిన వాతావరణం అలాంటిదే. నా విశ్లేషణ కరెక్టన్న భావంతో అత్తయ్య పిలుపుతో మళ్లీ పనిలో నిమగ్నమయ్యాను.

★